క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు: మండలంలోని ఆవులమంద, కురిచేడు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అత్యవసరమైన వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం దర్శిలో బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు వెన్నుపోటు దినం

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న దారుణాలకు నిరసనగా బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి తెలిపారు. ఉదయం ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ఎన్‌జీవో కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు చేరాలని ఆయన కోరారు.


పంక్చర్ పడి నిరూపయోగంగా ఉన్న రిక్షాలు


గ్రామ వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

జీతాలు లేక పారిశుధ్య కార్మికుల అవస్థలు

- ఆరు నెలలుగా అందని జీతాలు
- బతుకు బండిని భారంగా లాగుతున్న కార్మికులు
- పారిశుధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

తాళ్లూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామాల పరిశుభ్రతే దేశ పరిశుభ్రత లక్ష్యంగా ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను నియమించింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు అనారోగ్యం దరి చేరకుండా చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్య కార్మికులు బాధ్యతగా గ్రామ వీధుల్లో ఉండే చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఊరి బయట ఉన్న డపింగ్ యార్డులకు తరలిస్తుంటారు. పారిశుధ్య కార్మికులు పని చేస్తున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి సమయానికి జీతాలు ఇవ్వడంలో విఫలమైంది. మండలంలో మొత్తం 16 పంచాయతీలకు 53 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరు రాత్రనక పగలనక, ఎండనక వాననకా నిత్యం పనిచేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రాకపోవడం వారికి ఇబ్బందిగా మారింది. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వారిని ఇబ్బంది పెడుతోంది. గత ప్రభుత్వంలో సమయానికి జీతాలు అందేవని పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. వేరే బతుకుదెరువు లేక పని చేస్తున్నామని మరికొందరు పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. జూన్‌లో పిల్లలకు బడి ఫీజులతో పాటు దుకాణాల వద్ద అప్పుగా తెచ్చుకున్న నిత్యావసరాలకు డబ్బులు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. కుటుంబ పోషణ కోసం ప్రతినెలా తెలిసిన వారి వద్ద డబ్బులు అప్పుగా తెచ్చుకుంటేనే ఇళ్లు గడవడం కష్టంగా ఉందంటూ ప్రభుత్వ పనితీరుపై పారిశుధ్య కార్మికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల పట్ల దయచూపి ఆగిన జీతాలు అందేలా చూడాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.


తూర్పుగంగవరంలో రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

మాకు జీతాలు ఇవ్వాలి



చాలా సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నా. జీతాలు సక్రమంగా రావడం లేదు. గతంలో నెలకు రూ.6 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10 వేలు ఇస్తామంటున్నారు. అదే జరిగితే కుటుంబ పోషణ మెరుగ్గా ఉంటుంది. అధికారులు పట్టించుకుని మా జీతాలు ఇవ్వాలి.

– రాపూరి అంజనేయులు, తూర్పుగంగవరం

నిత్యావసరాలు అప్పుగా తెచ్చుకుంటున్నాం



కూటమి ప్రభుత్వం 10 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నిత్యావసరాలు దుకాణాల వద్ద అప్పుగా తెచ్చుకుంటున్నాం. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి జీతాలు సకాలంలో అందించాలి.

– కొప్పుల వెంకటయ్య, బొద్దికూరపాడు

ఒబ్బాపురానికి సాగర్ నీరు బంద్


చందవరం సమ్మర్ స్టోరేజి ట్యాంకు

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

దొనకొండ: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు చందవరం సమ్మర్ స్టోరేజీలో తాగునీరు పూర్తిగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ఒబ్బాపురం ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం దొనకొండలోని ఒబ్బాపురంలో సాగర్ నీరు సరఫరాగాక 3 నెలలు కావస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా స్పందించిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ వేసవి తాపం ఎక్కువ ఉందని, సాగర్ నీరు తప్పా ఈ ప్రాంతంలో చేతి పంపులు, డీప్ బోర్లు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 2 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సాగర్ నీరు రాకపోవడంతో డబ్బు వెచ్చించి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. మినరల్ వాటర్ కొనలేని వారు ఫ్లోరైడ్‌తో కూడిన నీటిని తాగి వ్యాధులకు గురవుతున్నారు. గతంలో 10 రోజులకు ఒక్కసారి సాగర్ నీరు వచ్చేది. నేడు అలాంటి పరిస్థితి లేదంటున్నారు. ఎన్నోసార్లు ఒబ్బాపురానికి సాగర్ నీరు సరఫరా కావటం లేదని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలామంది పేదవారు రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో సాగర్ నీరు సరఫరా కాక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వస్తున్నారు..పోతున్నారు తమ గోడు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఒబ్బాపురం గ్రామ ప్రజలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సాగర్ నీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలను పట్టించుకోవడం లేదు



అధికారులు, రాజకీయ నాయకులు ప్రజల సమస్యలు పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒబ్బాపురానికి తాగునీరు సరఫరా కాలేదని, తాగేందుకు ఇబ్బందికరంగా ఉందని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా మాట దాటేస్తున్నారు. మా ఇష్టం.. సరఫరా చేసినప్పుడే నీరు పట్టుకోండి.. లేకుంటే లేదు.. అనే మాటలు మాట్లాడుతున్నారు. 3 నెలల నుంచి సాగర్ నీరు రాక ఫ్లోరైడ్ నీటిని తాగి వ్యాధులకు గురవుతున్నాం.

– కుమార్, ఒబ్బాపురం

ఉపాధి కూలీలకు వేతనాలు ఇప్పించాలి

దర్శి (కురిచేడు): వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు వేతనాలు ఇప్పించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తిని రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్ కుమార్ కోరారు. దర్శి మండలంబలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు నెల రోజులుగా వేతనాలు లేక ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాల నాయకులు మిట్ట రమేష్, జ్యోతి వీరయ్య పాల్గొన్నారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రేమ్‌కుమార్

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముండ్లమూరు (కురిచేడు): మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాలని ముండ్లమూరు వైద్యాధికారి ఎం.జాస్మిన్ కోరారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్మిన్ మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ఎనాఫిలిస్ అనే ఆడదోమ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ప్రజలు దోమకాటు నుంచి రక్షణ పొందగలిగితే జ్వరాలు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. దర్శి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.బసవారెడ్డి మాట్లాడుతూ ఇంటి లోపల, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం నీటి తొట్లు, డ్రమ్ములు శుభ్రం చేసుకొని ఎండ బెట్టాలన్నారు. నీటి పాత్రలపై మూతలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. దోమలు కుట్టకుండా దోమల తెరలు వాడాలని సూచించారు. సీహెచ్ఓ నారాయణరావు, హెచ్ఈ శారద, హెల్త్‌సూపర్‌వైజరు సుబ్బారావు, ఏఎన్ఎంలు, ల్యాబ్‌టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి


కబడ్డీ ఆడుతున్న పిల్లలు

పెద్దారవీడు: పిల్లలు పుస్తకం పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పడం, యోగా, స్కిప్పింగ్, కబడ్డీ, ఆటలు ఆడించారు. ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విజ్ఞానంతో పాటు ఆటలు, పాటలు నేర్చుకోవాలని, ఆరోగ్యంగా ఉంటూనే చదువు కూడా నేర్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో 23 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


యోగాంధ్రకు హాజరైన వివిధ శాఖల ఉద్యోగులు

యోగాతో ఆరోగ్యం

త్రిపురాంతకం: అందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద ఒక్క రోజు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత వివరించారు. పతంజలి యోగా గురువు బాలసుబ్రహ్మణ్యం యోగాసనాలు, ధ్యానం చేయిస్తూ వాటి ప్రాధాన్యం వివరించారు. రోజూ యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో సీఈఓ చిరంజీవ, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంఈఓలు మల్లికార్జున నాయక్, రాజశేఖరరెడ్డి, ఆలయాల ఈఓ రజనీ కుమారి పాల్గొన్నారు. అధికారులతో పాటు మండలంలోని ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పొదుపు గ్రూపుల సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురంలో చిరుజల్లులు


మార్కాపురం పట్టణంపై కమ్ముకున్న కారుమేఘాలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలో మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మేయడంతో సాయంత్రం 4 గంటలకే చీకటి పడినట్టుగా వాతావరణం మారిపోయింది. రోహిణి కార్తె ప్రభావంతో గత 4 రోజులుగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. సోమవారం సాయంత్రం మార్కాపురంతోపాటు కొనకనకనమిట్ల మండలంలో ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. మంగళవారం ఉదయం కూడా అక్కడక్కడా వర్షం కురిసింది.

పురంపై దోమల దండయాత్ర

- చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వలు
- ప్రధాన రోడ్ల వెంట డ్రెయినేజీలో తీసిన పూడిక ఎక్కడిదక్కడే..
- దోమలు విజృంభిస్తుండటంతో పట్టణ ప్రజల బెంబేలు
- పారిశుధ్యాన్ని మెరుగుపరచడంపై మున్సిపల్ యంత్రాంగం అశ్రద్ధ

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారైంది. ముఖ్యంగా శివారు ప్రాంతాలతోపాటు ప్రధాన వీధుల్లోని డ్రెయినేజీల్లోనూ మురుగు తాండవిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ప్రధాన రోడ్ల వెంట డ్రెయినేజీల్లో తీసిన పూడికను సైతం రోడ్ల మార్జిన్‌లో కుప్పలుగా పోసి మమ అనిపించారు. పేరుకు ఫాగింగ్ చేస్తున్నా దోమల బెడద మాత్రం వీడటం లేదని పట్టణ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చీకటి పడే సమయం నుంచే దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు లక్ష జనాభా ఉన్న మార్కాపురం పట్టణంలో 170 మందికిపైగా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రధాన వీధుల్లోనే సిబ్బందిని వినియోగిస్తూ మిగిలిన ప్రాంతాలను వదిలేయడంతో పారిశుధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రధానంగా సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని ఆనుకొని డివిజనల్ పంచాయితీ ఆఫీసు కార్యాలయం పక్కనే ఉన్న మురుగుకాలువ చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. తర్లుపాడు రోడ్డులోని ఎన్‌జీఓ హోమ్, ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ కార్యాలయం తదితర ప్రాంతాల వద్ద కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడం మురుగు ముందుకు కదలడం లేదు. ప్రెస్‌క్లబ్ దగ్గర మురుగు కాలువల్లో తొలగించిన చెత్త కుప్పలను అలాగే వదిలేశారు. ఇదే పరిస్థితి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉంది. ప్రధానంగా అయ్యప్ప స్వామి గుడి వద్ద వర్షం పడితే నడవలేని పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన పూడికతీత పనులు తాత్కాలిక ప్రయోజనాన్ని మాత్రమే ఇచ్చాయి. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ప్రెస్‌క్లబ్ వద్ద రోడ్డుపైనే చెత్త కుప్ప


ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ వద్ద కాలువలో నిలిచిన మురుగు


డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త


ఎన్‌జీఓ హోమ్ వద్ద మురుగు కాలువ దుస్థితి ఇలా..

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి అనర్థం

గిద్దలూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని మానుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. మండలంలోని కేపీ స్పల్లె గ్రామంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లతో వాటిల్లే ముప్పు గురించి గ్రామంలోని కిరాణా దుకాణాల యజమానులకు వివరించారు. జనపనార, వస్త్రంతో తయారు చేసిన సంచులను ఉపయోగించాలని కోరారు. అనంతరం రామాలయం వద్ద పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.